క్లుప్తంగా

శ్రీశైలానికి ఆర్టీసీ ప్రత్యేక ప్యాకేజీ టూర్

శ్రీకాళహస్తి: శ్రీశైలం పుణ్యక్షేత్రానికి ఏపీఎస్ ఆర్టీసీ రెండు రోజుల ప్రత్యేక ప్యాకేజీ టూర్ ఏర్పాటు చేస్తున్నట్టు డిపో మేనేజర్ రాజవర్ధన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్తీకమాసంలో శివ భక్తులకు ఇది శుభవార్త అన్నారు. ఈ రెండు రోజుల యాత్ర యాగంటి, మహానంది మీదుగా శ్రీశైలం పుణ్యక్షేత్రం వరకు సాగుతుందని తెలిపారు. వచ్చేనెల 3 తేదీ నుంచి ఈ బస్సు యాత్ర ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఉదయం 4 గంటలకు శ్రీకాళహస్తి ఏపీఎస్ ఆర్టీసీ బస్టాండ్ నుంచి బస్సు బయలుదేరుతుందని చెప్పారు. ఇందుకోసం అల్ట్రా డీలక్స్ బస్సును కేటాయించామని అన్నారు. రాను, పోను రూ. 2 వేలుగా టికెట్ ధర నిర్ణయించినట్లు తెలిపారు. ఈ బస్సుల రిజర్వేషన్ కోసం శ్రీకాళహస్తి ఏపీఎస్ ఆర్టీసీ రిజర్వేషన్ కౌంటర్‌లో సంప్రదించాలన్నారు వివరాలకు 73828 80178 ,73828 80239, 73828 75642 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

40 మంది విద్యార్థుల రక్తదానం



రక్తదానం చేస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

పాకాల: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 40 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. సోమవారం ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వి.రమేశ్‌కుమార్ సమక్షంలో ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఎన్‌సీసీ దినోత్సవం సందర్భంగా ఎన్‌సీసీ క్యాడెట్లు రక్తదానం చేశారని తెలిపారు. ఎన్‌సీసీ ఆఫీసర్ డాక్టర్ ఈశ్వర్‌బాబు మాట్లాడుతూ కోట్లు ఖర్చు చేసినా కాపాడలేని ప్రాణాలను రక్తదానం ద్వారా కాపాడవచ్చన్నారు. అధ్యాపకులు మాసిలా మణి, చిట్టికళావతి, ఆదిశేఖర్‌రెడ్డి, రమణమ్మ, రెడ్‌క్రాస్ సిబ్బంది, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పెళ్లికానుక అందజేత



వధువు బంధువులకు ఎమ్మెల్యే పెళ్లికానుక అందజేస్తున్న వైఎస్‌ఆర్ సీపీ నాయకులు

రామచంద్రాపురం: మండలంలోని నెన్నూరు గ్రామంలో త్వరలో వివాహం చేసుకోనున్న వధువు మాధవి తల్లిదండ్రులకు ఎంపీటీసీ జ్ఞానమ్మ, కో‌ఆప్షన్ మెంబర్ రాజేంద్రప్రసాద్, వైఎస్‌ఆర్ సీపీ నాయకులు చంద్రశేఖర్, ఢిల్లీబాషాలు సోమవారం ఎమ్మెల్యే పెళ్లికానుక అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తన సొంత నిధులతో చంద్రగిరి నియోజకవర్గంలో వివాహం చేసుకోబోతున్న వధూవరులకు పట్టు వస్త్రాలు, బంగారు తాళిబొట్టు, మెట్టెలు, తిరుమల శ్రీవారి ప్రసాదాలను అందిస్తున్నట్లు తెలిపారు.

క్రీడా పోటీల్లో ఎస్వీసీఈ విద్యార్థుల ప్రతిభ



క్రీడాకారులను అభినందిస్తున్న ఎస్వీసీఈ ప్రిన్సిపల్, సిబ్బంది

తిరుపతి సిటీ: తిరుపతి ఐఐటీ వేదికగా గత వారం రోజులపాటు జరిగిన అంతర్ కళాశాలల క్రీడా పోటీల్లో స్థానిక కరకంబాడి రోడ్డులోని ఎస్వీసీఈ విద్యార్థులు ప్రతిభ చూపారు. ఇందులో ప్రధానంగా క్రికెట్, వాలీబాల్, బాస్కెట్ బాల్, బ్యాడ్మింటన్ పోటీల్లో ఎస్వీసీఈ విద్యార్థులు పాల్గొన్నారు. క్రికెట్ విభాగంలో ఎస్వీసీఈ టీమ్ టోర్నమెంట్ విన్నర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి, కళాశాల పీడీలు కిషోర్ నాయక్, పి.చెన్నయ్య, పార్వతి, విజయలక్ష్మీ, అధ్యాపకులు క్రీడాకారులను అభినందించారు.

మహిళా వర్సిటీలో వేంకట సుబ్బారావు స్మారక సదస్సు



సదస్సులో ముఖ్యఅతిథులతో వర్సిటీ అధికారులు, విద్యార్థులు

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం తెలుగు అధ్యయన శాఖ ఆధ్వర్యంలో పోపూరి వేంకట సుబ్బారావు స్మారక ధర్మనిధి సదస్సు సావేరి సెమినార్ హాలులో సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వీసీ డి.భారతి పాల్గొన్నారు. ప్రసిద్ధ రచయిత్రి ఓల్గా మాట్లాడుతూ తమ తండ్రి పోపూరి వేంకట సుబ్బారావుగారితో తనకున్న అనుభవాలను పంచుకున్నారు. 'అంతరిక్ష పరిశోధనా రంగం–స్త్రీలు' అనే అంశంపై నిర్వహించిన కవితల పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు బహుమతి, జ్ఞాపికలను అందజేశారు. అనంతరం అతిథులను దుశ్శాలువాలతో సత్కరించారు. తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య కొలకలూరి మధు జ్యోతి, డాక్టర్ వై సుభాషిణి, డాక్టర్ డి.విజయభాస్కర్, కుప్పిలి పద్మ, డాక్టర్ యువశ్రీ పాల్గొన్నారు.

అన్నారావుసర్కిల్లో బ్రహ్మంగారు



విభూది అలంకరణలో శ్రీఅగస్త్యేశ్వరస్వామి, ప్రత్యేక అలంకరణలో అమ్మవారు





నెరబైలులో గుడిమిట్ట సిద్ధేశ్వర స్వామి



గంగమ్మ గుడిలో మహా చండీహోమం పూర్ణాహుతి



వెదల్లచెరువు జ్యోతిర్లింగేశ్వరాలయంలో అన్నదానం



భక్తిప్రపత్తులతో కార్తీక సోమవారం పూజలు

తిరుపతి కల్చరల్: కార్తీకమాసంలో రెండో సోమవారం నాడు ఆధ్యాత్మిక తిరుపతి నగరంలోని శివాలయాల్లో భక్తులతో సందడి నెలకొంది. శ్రీకపిలేశ్వర స్వామివారి ఆలయం, దేవేంద్ర థియేటర్ వద్దనున్న శివాలయం, మంచినీళ్ల గుంట వద్ద నున్న శివాలయాం, మంగళంలోని అన్నపూర్ణ సమేత ఈశానేశ్వర నవలింగ క్షేత్రంలో భక్తులు ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తి శ్రద్ధలతో పూజలు చేసి, దీపారాధన చేపట్టారు. కపిలతీర్థంలోని పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి శివలింగాలకు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అలాగే నిమ్మ, ఉసిరి కాయలు, పిండి దీపాలు వెలిగించి పూజలు చేపట్టారు. అనంతరం శ్రీకపిలేశ్వరస్వామి, కామాక్షి అమ్మవారు, శ్రీసుబ్రమణ్యస్వామి, గణపతి స్వామి ఆలయాల వద్ద దీపారాధనలు, పూజలు చేశారు.

సాయి మందిరంలో కార్తీక దీపోత్సవం

కొంకా వీధిలోని శ్రీద్వారకామయి శ్రీషిరిడీ సాయిబాబా మందిరంలో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని దీపోత్సవం వేడుకగా నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ఆవరణలో సాయిబాబా చిత్రం ఆకారంలో దీపారాధన చేశారు. సాయిబాబా సేవా సమాజ్ కమిటీ గౌరవాధ్యక్షుడు మబ్బు దేవనారాయణరెడ్డి, కుడితి సుబ్రమణ్యం, దుర్గం శ్రీనివాసులు మర్దం శివ, ఆవుల శ్రీనివాసులు, కుడితి బాబు, రమేష్, విజయలక్ష్మి, ప్రభాకర్, సభ్యులు పాల్గొన్నారు.

వేడుకగా పున్నమి పూజలు

నగరంలోని అన్నారావు సర్కిల్‌లో వెలసిన శ్రీ వీరబ్రహ్మంద్రే స్వామివారి ఆలయంలో సోమవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు వేడుకగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని కార్తీక దీపాలు వెలిగించారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం చేపట్టారు. 2000 మందికి అన్నప్రసాదాలను పంపిణీ చేశారు.





చంద్రగిరి వద్దర స్వర్ణముఖి తీరంలోని ముక్కోటి ఆలయంలో దీపారాధన చేస్తున్న భక్తులు

వేడుకగా మహా చండీహోమం

కార్తీక పౌర్ణమి సందర్భంగా శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో సోమవారం మహా చండీ హోమం వేడుకగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన హోమ మండపానికి అమ్మవారి ఉత్సవమూర్తిని కొలువుదీర్చి ఉదయం 9 గంటలకు అర్చక పండితుల వేద మంత్రోచ్చారణ నడుమ మహా చండీ హోమం శాస్త్రోక్తంగా చేపట్టారు. అనంతరం 11.45 గంటలకు చేపట్టిన పూర్ణాహుతితో మహా చండీ హోమం ముగిసింది. మేయర్ డాక్టర్ శిరీష, ఆలయ చైర్మన్ కట్టా గోపియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిర్లింగేశ్వర ఆలయంలో కార్తీక దీపోత్సవం

తిరుపతి గాంధీ రోడ్: కార్తీక పౌర్ణమి సందర్భంగా రేణిగుంట మండలం వెదల్లచెరువు గ్రామంలో వెలసిన ఓంకార జ్యోతిర్లింగేశ్వర స్వామి ఆలయం శివనామ స్మరణలతో మార్మోగింది. సోమవారం ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు గుండాల గోపీనాథ్‌రెడ్డి, కృష్ణయ్య స్వామి, చంద్రశేఖర స్వామి, సూరా రఘురామిరెడ్డి, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, కొండే చెంగారెడ్డి, జయలక్ష్మి, శ్రీదేవి, విజయ లక్ష్మి, శ్రీనివాసులు, ప్రసాద్ పాల్గొన్నారు.

కిక్కిరిసిన శివాలయాలు

చంద్రగిరి: కార్తీక మాసం పౌర్ణమి సందర్భంగా సోమవారం మండల పరిధిలోని ఆలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. తొండవాడ స్వర్ణముఖీనది ఒడ్డున వెలసిన శ్రీఅగస్త్యేశ్వరస్వామి(ముక్కోటి) ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని విభూది అలంకరణలో సుందరంగా అలంకరించారు. అనంతరం ఆలయ ధర్మకర్త మొగిలి రఘురామిరెడ్డి భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.



సాయిబాబా ఆకారంలో కార్తీక దీపారాధన

శివాలయాల్లో భక్తుల సందడి

భాకరాపేట: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని నిర్వహించిన జ్వాలా తోరణం కార్యక్రమానికి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చి కార్తీక దీపాలను వెలిగించి, మొక్కులు చెల్లించుకున్నారు. సోమవారం వేకువ జాము నుండే శివాలయాలు భక్తులతో నిండిపోయాయి. ఎర్రావారిపాళెం మండలంలోని తలకోన సిద్ధేశ్వర స్వామి ఆలయం, నెరబైలులోని గుడిమిట్ట సిద్ధేశ్వర స్వామి ఆలయం, చిన్నగొట్టిగల్లు మండలంలోని భీమేశ్వర స్వామి ఆలయం, బండకొండ సిద్ధేశ్వరస్వామి, నెమలిగుండ్లు శివాలయంలో భక్తులు మహాదేవున్ని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

లక్ష్మీనరసింహుడి సేవలో టీటీడీ చైర్మన్ భూమన



పెంచలకోనలో ధ్వజ స్తంభానికి నమస్కరిస్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి

రాపూరు: మండలంలోని పెంచలకోనలో ఉన్న పెనుశిల లక్ష్మీనరసింహస్వామివారిని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి సోమవారం దర్శించుకున్నారు. ఆయనకు దేవస్థానం సిబ్బంది పూర్ణకుంభం స్వాగతం పలికి, లక్ష్మీనరసింహస్వామివారి ప్రత్యేక దర్శన ఏర్పాటు చేశారు. నిత్యకల్యాణ మండపంలో భూమన కరుణాకరరెడ్డికి లక్ష్మీనరసింహస్వామి, అమ్మవార్ల చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేశారు. వేదపండితుల ఆశీర్వచనం పలికారు. ఆలయ ప్రధానార్చకులు సీతారామయ్యస్వామి పాల్గొన్నారు.

ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడిగా బాలాజీ



ఎస్.బాలాజీ

తిరుపతి ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం(ఆపస్) రాష్ట్ర అధ్యక్షుడిగా తిరుపతికి చెందిన ఎస్.బాలాజీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయవాడలోని ఆపస్ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర కార్యనిర్వాహక వర్గ సమావేశంలో ఆయన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సైన్స్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న బాలాజీ కార్వేటినగరంలోని డైట్‌లో లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈయన ఎన్నికపై ఆ సంఘం తిరు పతి, చిత్తూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, సాంబిరెడ్డి, మంజునాథ గుప్తా, విజయ్ ఇతర సభ్యులు అభినందనలు తెలిపారు.

తిరుపతి అభివృద్ధిని అడ్డుకుంటే తిరుగుబాటు

– వైఎస్‌ఆర్ సీపీ మహిళా నేతలు

తిరుపతి కల్చరల్: నగర అభివృద్ధికి టీటీడీ నిధులు కేటాయించే నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ, అడ్డుకుంటున్న బీజేపీ నేతలపై ప్రజా తిరుగుబాటు తప్పదని వైఎస్ ఆర్ సీపీ మహిళా నాయకురాళ్లు హెచ్చరించారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో వైఎస్‌ఆర్ సీపీ నాయకురాలు, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యురాలు రుద్రరాజు శ్రీదేవి మాట్లాడారు. తిరుపతి అభివృద్ధి కోసం డెప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి మాస్టర్ ప్లాన్ రోడ్లను ఏర్పాటు చేసి, శరవేగంగా అభివృద్ధికి బాటలు వేస్తున్నారన్నారు. తిరుపతి పారిశుధ్యాన్ని మరింత మెరుగు పరిచి ఆరోగ్యకర నగరంగా రూపొందించాలనే ఉద్దేశంతో టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి చొరవ తీసుకుంటున్నారన్నారు. ప్రజా సంక్షేమానికి వీరు చేస్తున్న కృషి చూసి ఓర్వలేక బీజేపీ నేత భానుప్రకాష్‌రెడ్డి రాజకీయ వక్రబుద్ధితో అవాకులు చవాకులు పేలుతున్నారని విమర్శించారు. గతంలో టీటీడీ బోర్డు సభ్యుడిగా భానుప్రకాష్‌రెడ్డి తిరుపతి అభివృద్ధికి ఏమీ చేయకపోగా కేవలం చెన్నై క్లబ్బుల నుంచి శ్రీవారి పేరుతో పెద్ద మొత్తంలో ముడుపులు అందుకున్నారని ఆరోపించారు. నగర అభివృద్ధిపై చిత్తశుద్ధి లేని బీజేపీ నేతలు టీటీడీ నిధులు తిరుపతికి కేటాయిస్తే ప్రశ్నించడం విడ్డూరమన్నారు. అభివృద్ధికి అడ్డుపడితే నగరవాసులతో కలిసి ఇంటిని ముట్టడించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్పొరేటర్ దూవి కుమారి, వైఎస్‌ఆర్ సీపీ నాయకురాళ్లు పద్మజ, మంజుల పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యురాలు రుద్రరాజు శ్రీదేవి

అంకుర సంస్థలకు రూ.63.80 లక్షల నిధులు విడుదల

తిరుపతి సిటీ: రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం కింద ఐదో బ్యాచ్‌కు చెందిన అంకుర సంస్థలకు కేంద్ర ప్రభుత్వం రూ.63.80 లక్షలు విడుదల చేసింది. తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో నెలకొల్పిన అంగ్రూ పోషణ్ ఇంక్యుబేటర్‌లో శిక్షణ పొందిన ఐదో బ్యాచ్‌కు చెందిన తొమ్మిది అంకుర సంస్థలకు ఈ మొత్తాన్ని సోమవారం ఎన్‌జీ రంగా వర్సిటీ పరిశోధన సంచాలకురాలు డాక్టర్ ఎల్ ప్రశాంతి చేతుల మీదుగా అందజేశారు. ఆర్ఏఆర్ఎస్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ రంగాల్లో ఏర్పాటైన అంకుర సంస్థలు శక్తివంతమైన అగ్రి స్టార్టప్ వ్యవస్థను నిర్మించడానికి అంగ్రూ పోషణ్ ఇంక్యుబేటర్ ప్రయత్నిస్తోందన్నారు. మొదటి విడతగా ఎంపికైన తొమ్మిది అంకుర సంస్థలకు రూ.44.20 లక్షలు పంపిణీ చేశామన్నారు. మదనపల్లెకు చెందిన పి.శ్రీనిధికి రూ.8 లక్షలు, తిరుపతికి చెందిన ప్రవీణ్ కుమార్‌కు రూ.3 లక్షలు, ఐఐటీ నూజివీడుకు చెందిన సలాడి దేవి గాయత్రీమణికి రూ.3 లక్షలు, మరో ఆరుగురికి పంపిణీ చేశామన్నారు. సహ పరిశోధన సంచాలకుడు డాక్టర్ సి రమణ, ఇంక్యుబేటర్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ పి బాల హుస్సేన్ రెడ్డి, బీఎం లక్ష్మీతులసి, అశ్విక్, సంతోష్, రమాదేవి పాల్గొన్నారు.



చెక్కు పంపిణీ చేస్తున్న వర్సిటీ పరిశోధన సంచాలకులు డాక్టర్ ఎల్ ప్రశాంతి, శాస్త్రవేత్తలు

నగరాభివృద్ధిని అడ్డుకునేవారు చరిత్ర హీనులు

తిరుపతి కల్చరల్: నగరాభివృద్ధిని తప్పుడు మాటలు, తప్పుడు రాతలతో అడ్డుకుంటే చరిత్ర హీనులుగా మిగిలిపోతారని వైఎస్‌ఆర్ సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణ చైతన్య విమర్శించారు. తిరుపతి అభివృద్ధికి టీటీడీ నిధులపై పచ్చ పత్రికలు రోత రాతలు రాస్తున్నాయంటూ వైఎస్‌ఆర్ సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణ చైతన్య యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం ప్లకార్డులతో ర్యాలీ చేపట్టారు. అనంతరం నాలుగు కాళ్ల మండపం వద్ద పచ్చ పత్రికలను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వలాభాపేక్షతో కొందరు తిరుపతి అభివృద్ధిని అడ్డుకుంటున్నారని, పచ్చపత్రికలు సైతం వారికి వంత పాడుతూ తప్పుడు రాతలు రాయడం దుర్మార్గమని విమర్శించారు. తిరుపతి అభివృద్ధిని అడ్డుకునే వారికి రానున్న రోజుల్లో పౌర సమాజం తగిన విధంగా బుద్ధి చెబుతుందని హెచ్చరించారు. వైఎస్‌ఆర్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఆర్ఏ.అజయ్‌కుమార్, కట్టా గోపియాదవ్, పసుపులేటి సురేష్, మునిరామిరెడ్డి, బత్తుల అరుణ్ యాదవ్, మద్దాలి శేఖర్, తాళ్లూరి ప్రసాద్, రాజేష్‌రెడ్డి, వాసు యాదవ్, భరణీ యాదవ్ పాల్గొన్నారు.



తప్పుడు కథనాలను వ్యతిరేకిస్తూ పచ్చ పత్రికల దహనం

రద్దీ ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయండి

తిరుపతి కల్చరల్: రద్దీ ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ హరిత ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ కమిషనర్, అర్జీలు స్వీకరించే స్పందన కార్యక్రమంలో పాల్గొన్నారు. డయల్ యువర్ కమిషనర్‌కు 8, స్పందనకు 16 ఫిర్యాదులు అందాయి. టీటీడీ పరిపాలనా భవనం ముందు శాశ్వత స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలనే ఫిర్యాదుపై కమిషనర్ స్పందించారు. నగరంలో రద్దీ ప్రాంతాలను గుర్తించి అవసరమైన ప్రదేశాల్లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఉప కమిషనర్ చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, ఎస్ఈ మోహన్, మున్సిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, రెవెన్యూ అధికారులు కేఎల్.వర్మ, సేతుమాధవ్, కార్యదర్శి రాధిక, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్‌రెడ్డి, డెప్యూటీ సిటీ ప్లానర్ శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

మృతి చెందిన పాత్రికేయులకు ఘన నివాళి

తిరుపతి కల్చరల్: ప్రెస్‌క్లబ్ కమిటీ ఆధ్వర్యంలో ఇటీవల మృతి చెందిన పాత్రికేయులను స్మరించుకుంటూ వారికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. మృతి చెందిన సీనియర్ పాత్రికేయులు జీఆర్.నాయుడు, మించల రవి, ఆవుల నాదముని, స్పోర్ట్స్ శ్రీనుల చిత్రపటాలను సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేశారు. జర్నలిస్టులందరూ పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు జోగిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కార్యదర్శి బాలచంద్ర, శివశంకర్, గోపాలకృష్ణయ్య, దామోదర్ నాయుడు, ప్రసాద్, మాజీ ఎంపీ చింతా మోహన్, జర్నలిస్టులు పాల్గొన్నారు.



పాత్రికేయులకు శ్రద్ధాంజలి ఘటిస్తున్న ప్రెస్‌క్లబ్ కమిటీ ప్రతినిధులు, జర్నలిస్టులు